క్లుప్తంగా

రేపు రక్తదాన శిబిరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి తదితరులు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామం అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో శుక్రవారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం క్యాంపస్‌లో ప్రిన్సిపాల్ డాక్టరు కమలకుమారి, సిబ్బంది పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎంఎస్ఎన్ పీజీ సెంటర్ ఎన్ఎస్ఎస్, రెడ్‌క్రాస్ సొసైటీ, మాణిక్ రెడ్డి హెల్త్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ ఎల్.మధుకుమార్, శ్రీనివాసరావు, ప్రొఫెసరు ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

రోటరీ అసిస్టెంట్ గవర్నర్‌గా తడాల



రోటరీ గవర్నర్ నుంచి నియామకపత్రం అందుకుంటున్న వరప్రసాద్‌బాబు

బోట్‌క్లబ్: రోటరీ అంతర్జాతీయ జిల్లా 3020 అసిస్టెంట్ గవర్నర్‌గా రోటరీ క్లబ్ కాకినాడ మాజీ అధ్యక్షుడు తడాల వరప్రసాద్‌బాబు 2023–24 సంవత్సరానికి ఏకగ్రీవంగా నియమితులయ్యారు. నర్సీపట్నంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జిల్లా గవర్నర్ దత్త సుబ్బారావు ఆయనకు నియామక పత్రం అందించారు. వరప్రసాద్‌బాబును రోటరీ మాజీ గవర్నర్లు కేవీఎస్ ఆంజనేయమూర్తి, ఎల్.సత్యనారాయణన్, రోటరీ గవర్నర్‌గా ఎన్నికైన కల్యాణ్‌చక్రవర్తి, క్లబ్ అధ్యక్షురాలు సురభి శారద అభినందించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: నగరంలోని జగన్నాథపురం, అన్నమ్మఘాటీ విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో శుక్రవారం ఉదయం 9.30 గంటల నుంచి 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ జి.ప్రసాద్ బుధవారం తెలిపారు. 33/11కేవీ జగన్నాథపురం విద్యుత్ ఉపకేంద్రంలో 11 కేవీ, చొల్లంగిలో 33/11 కేవీ, అన్నమ్మఘాటీ విద్యుత్ ఉపకేంద్రంలోని 11 కేవీ తారకరామనగర్ ఫీడర్ పరిధిలో లైన్ మరమ్మతులు చేస్తున్నామన్నారు. ఈ పనుల నిర్వహణకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆయన తెలిపారు. ముత్తానగర్, గోళీలపేట, వలందపేట, తుపాను బిల్డింగ్, పోర్టు కాలనీ, పురంవారి వీధి, నరసింహా రోడ్, శివాలయం వీధి, తారకరామనగర్, కొవ్వూరు రోడ్, సుందర్‌నగర్, పప్పుల మిల్లు ఏరియా, పరదేశమ్మపేట ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

జగనన్న ఇళ్లపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ, ఏఈలు

కాకినాడ రూరల్: మండలంలోని జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాలపై మండల పరిషత్ కార్యాలయంలో డీఎల్‌డీఓ నారాయణరావు బుధవారం సమీక్షించారు. ఎంపీడీఓ శ్రీనివాస్, గృహ నిర్మాణ శాఖ ఏఈ నాగభూషణం, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు హాజరుకాగా తిమ్మాపురం, నేమాం, పండూరు గ్రామాల్లోని జగనన్న లే అవుట్లలో గృహ నిర్మాణాల ప్రగతిపై సమీక్షించి, వేగవంతం చేయాలని ఆయన కోరారు.

పందుల వేట ప్రారంభం



పందులను తరలిస్తున్న వాహనం

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో బుధవారం తెల్లవారు జాము నుంచి పందుల వేట ప్రారంభించారు. ఇటీవల పందుల పెంపకందారులతో అనేక పర్యాయాలు సమావేశాలు నిర్వహించి జనవరి 20 తరువాత పట్టణంలో పందులు తిరగడానికి వీలు లేదని చైర్ పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్ ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. అయినా పందుల సంచారం ఆగకపోవడంతో గత నెలాఖరులో జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఈ విషయమై అధికారులపై ధ్వజమెత్తారు. ఈ మేరకు భారీ పోలీసు బందోబస్తు మధ్య పట్టణ పరిధిలో వార్డుల్లో ఉన్న పందులను పట్టుకుంటున్నారు. పట్టుకున్న సుమారు 300 పందులను ఆరు వాహనాలలో జంగారెడ్డిగూడెం సమీపంలోని అటవీ ప్రాంతాల్లో విడిచి పెడుతున్నట్లు శానిటరీ ఇన్‌స్పెక్టరు పి.శ్రీనివాసరావు తెలిపారు.

ప్రకటనలకే పరిమితం



రామచంద్రపురం రహదారిలో వాకాడ సమీపంలో ప్రచార హోర్డింగ్



కరప, పెనుగుదురు రోడ్డులో ఉన్న వ్యాపార ప్రకటనల బోర్డులు

- నిబంధనలకు విరుద్ధంగా హోర్డింగ్‌లు
- అనుమతుల్లేకుండా ప్రచారాలు
- పంచాయతీల ఆదాయానికి గండి

కరప: ప్రభుత్వానికి ఆదాయ మార్గాల్లో ప్రకటనలు ఒకటి. ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితమైన ఈ ఒరవడి నేడు పల్లెలకూ విస్తరించింది. బోర్డు, వాల్‌పోస్టర్, లేదా హోర్డింగ్ పరిమాణాన్ని బట్టి ప్రకటనకర్తలు ప్రభుత్వానికి రుసుము చెల్లిస్తుంటారు. వ్యాపార, రాజకీయ, శుభాశుభ కార్యక్రమాలు ఇలా ఏదైనా ప్రతి ప్రకటనకు నిబంధనల మేరకు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. కానీ ఇటువంటి ప్రకటనలను అధికారులు చూసీ చూడనట్టు వదిలేయడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ప్రకటన బ్యానర్లు, బోర్డులు, హోర్డింగులు ఏ ప్రభుత్వ శాఖల స్తంభాలకు కట్టారో, లేదా ప్రైవేటు స్థలాల్లో కట్టారో వాటికి సంబంధించి అధికారుల అనుమతులు, చలానాలు చెల్లించాల్సిన అవసరం ఉంది.

ప్రమాదకరంగా మారుతున్న వైనం..

సాధారణంగా ప్రకటనలు ఆకర్షణీయంగా ఉండడమూ, గాలి వానలకు తట్టుకునేలా పటిష్టమైన హోర్డింగులపై ఏర్పాటు చేయడమూ జరుగుతుంది. ఈ క్రమంలో ఆకర్షణీయమైన హోర్డింగులు సహజంగానే పాదచారులను, వాహనచోదకులనూ ఆకర్షిస్తూ కళ్లు వాటిపై నిలిపి ఉంచేలా చేస్తాయి. ప్రమాదం జరగడానికి క్షణకాలం చాలు. ఏ వాహన ప్రమాదమైనా జరగొచ్చు, లేదా పాదచారి ఏ గుంతలోనైనా పడవచ్చు. ఇక మరో అంశం పటిష్టమైన హోర్డింగులు అమర్చేటపుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్ల ఏ క్షణమైనా జారిపడే అవకాశం ఉంటుంది. ఇటువంటివీ లేకపోలేదు. ప్రధాన కూడళ్లలో విద్యుత్ స్తంభాలకు వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఇదీ ప్రమాదకరమైన పరిస్థితే కావడం గమనార్హం.

లెక్కకు మిక్కిలిగా ప్రకటనలు..

మండలంలోని పలు గ్రామాల మీదుగా ఉన్న కాకినాడ, రావులపాలెం, పెనుగుదురు, కోటిపల్లి రహదారుల వెంబడి ఎన్నో ప్రకటనలు ఉన్నాయి. కాకినాడ పట్టణానికి చెందిన పలు వ్యాపార సంస్థలతో పాటు మండలంలోని వ్యాపార సంస్థలు ప్రధాన రహదారుల వెంబడి ఈ హోర్డింగ్‌లు ఎన్నో ఉన్నాయి. గ్రామ పరిధిలో హోర్డింగ్‌ల పరిమాణాన్ని బట్టి కనీసం రూ.50 నుంచి రూ.500 వరకూ పంచాయతీలకు అద్దె చెల్లించాలి. విద్యుత్ స్తంభాలకు రూ.10 నుంచి రూ.50 వరకూ ట్రాన్స్‌కోకు చెల్లించాల్సి ఉంది. అధికారులు వీటిని పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు పాటించాలి



మండలంలోని గ్రామాల్లో, రహదారుల పక్కన నిబంధనలకు అనుగుణంగా హోర్డింగులు ఏర్పాటు చేసుకోవాల్సి ఉంది. గ్రామ పంచాయతీల అనుమతి లేకుండా హోర్డింగ్‌లు ఏర్పాటు చేసిన వ్యాపార సంస్థలకు నోటీసులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన ప్రకటన బోర్డులపై పన్ను వసూలుచేయాలని గ్రామ కార్యదర్శులకు సర్క్యులర్ పంపిస్తాం.

– ఎస్వీ శ్రీనివాసరావు, ఈఓ పీఆర్డీ, కరప.

ఆదాయం పెరిగేలా చర్యలు



గ్రామ పరిధిలో ప్రకటన బోర్డులు చాలా ఎక్కువగా ఉంటున్నాయి. పంచాయతీ అనుమతి లేకుండానే వ్యాపారులు హోర్డింగులు పెడుతున్నారు. దీనిపై కార్యదర్శితో చర్చించి, గ్రామ పంచాయతీకి ఆదాయం పెంచేందుకు చర్యలు తీసుకుంటాం.

– సాదే ఆశాజ్యోతి, గ్రామ సర్పంచ్, కరప.

మానవ విలువలను పెంపొందించుకోవాలి



భక్తులకు ఆధ్యాత్మిక ఉపదేశం చేస్తున్న సద్గురుమాత సుదీక్షాజీ మహారాజ్

కాకినాడ కల్చరల్: మానవ విలువలను పెంపొందించు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సంత్ నిరంకారి మండలి ఆధ్యాత్మిక సంస్థ సద్గురుమాత సుదీక్షాజీ మహారాజ్ ఉపదేశించారు. స్థానిక సూర్యకళామందిర్‌లో నగరశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఆధ్యాత్మిక సమావేశం జరిగింది. బ్రహ్మజ్ఞానం పొందడం ద్వారా మానవుడి మనసులో భ్రమలు తొలగిపోతాయని పేర్కొన్నారు. మానవులందరూ ఒకరితో ఒకరు ప్రేమ, సద్భావనతో మెలిగినప్పుడు వసుదైక కుటుంబం అనే భావన సాకారమవుతుందని ఆమె అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సంస్థ కన్వీనర్ దాసరి రామకృష్ణ, భాస్కరరావు, గరికిన మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాలనపై ప్రజల్లో పూర్తి సంతృప్తి



లబ్ధిదారుకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

- ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి
- 24వ డివిజన్‌లో గడప గడపకూ..

కాకినాడ: ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్న పథకాలు, వాటి అమలు తీరుపై ప్రజల్లో పూర్తి సంతృప్తి కనిపిస్తోందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరడ్డి పేర్కొన్నారు. స్థానిక 24వ డివిజన్ అన్నమఘాటీ సెంటర్ ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్యే ద్వారంపూడి ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ మూడున్నరేళ్ల ప్రభుత్వ పాలనలో అందించిన ప్రభుత్వ పథకాల లబ్ధిని ప్రజలకు వివరించారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న, నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, పలువురు అధికారులు, మాజీ కార్పొరేటర్లు వీరి వెంట ఉన్నారు. గడపగడపలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు ఉన్నారన్నారు. ప్రజల ప్రతీ కష్టానికి ఒకొక్క పథకాన్ని అమలు చేస్తూ పేదల సంక్షేమానికి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న పథకాలను ప్రజలు ఎంతగానో ఆదరిస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి అధికారంలో కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ప్రజలు కూడా పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, డీఈ మాధవి, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కర్రి శైలజ, నగర బీసీ సెల్ అధ్యక్షుడు పేర్ల రజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే కన్నబాబు
- వాకలపూడిలో గడప గడపకూ..



వాకలపూడిలో లబ్ధిదారుకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని వాకలపూడిలో సచివాలయం–4 పరిధిలో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కన్నబాబు నిర్వహించారు. తొలుత వాకలపూడి సంతోష్‌నగర్‌లోని విజయదుర్గ ఆలయం వద్ద పార్టీ గ్రామ నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారిని, వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న అనంతరం ఇంటింటికీ పర్యటించి గ్రామస్తులకు మూడున్నరేళ్లలో అందిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీధి లైట్లు, డ్రైన్లు, రహదారులు తదితర సమస్యలను ఎమ్మెల్యేకు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వాటిని పరిష్కరించాలని అక్కడే ఉన్న అధికారులను ఆదేశించారు. కన్నబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ సంక్షేమ ప్రభుత్వాన్ని నడుపుతున్నారని అన్నారు. పేదలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్టు తెలిపారు. అర్హతే ప్రామాణికంగా నవరత్న పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కాకినాడ రూరల్ నియోజకవర్గంలో అత్యధిక మంది లబ్ధిదారులు ఉన్నారని, ప్రతి కుటుంబానికీ మేలు జరుగుతుందన్నారు. సుమారు 32 వేల మందికి ఇళ్ల పట్టాలు అందించామన్నారు. గృహ నిర్మాణాలు వేగవంతం చేసి గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జెడ్పీటీసీ నులుకుర్తి రామకృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ పాండు రంగారావు, మండల ఇంజినీర్ వాసుదేవరావు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులు పాలపర్తి గోపి, గ్రామ కమిటీ అధ్యక్షుడు గొల్లపల్లి జగన్, కో–ఆప్షన్ సభ్యుడు సంగాడి మోషే, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ కరీం బాషా, గోపుశెట్టి బాబ్జీ, గంపల సత్యనారాయణ, విజయసారథి, నల్లా శ్రీను, రాణి, కడియాల రాజు, గొల్లపల్లి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమస్యలకు సత్వర చర్యలు

- ఐదు అంచెల విధానంలో నీటి సరఫరా
- ఆర్డీవో బీవీ రమణ



అధికారులకు సూచనలు ఇస్తున్న ఆర్డీవో బీవీ రమణ

కరప: రబీలో సాగునీటి లభ్యత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఐదు అంచెల విధానంలో నీటిని సరఫరా చేయాలని నిర్ణయించినట్టు ఆర్డీఓ బీవీ రమణ వివరించారు. మండలంలోని అరట్లకట్ట గ్రామంలో సాగునీటి ఎద్దడితో సాగు సమస్య ఎదుర్కొంటున్న పొలాలను రెవెన్యూ, వ్యవసాయ, జల వనరుల శాఖ అధికారులతో రైతులతో కలసి ఆర్డీవో బీవీ రమణ పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు సాగునీటి సమస్య ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో పర్యటించి సాగు సమస్యను అధిగమించాల్సిన చర్యలపై మండలాధికారులతో చర్చించినట్టు తెలిపారు. ముఖ్యంగా సాగునీటి సరఫరాకు సంబంధించి ప్రస్తుతం ఉన్న మూడంచల విధానంలో కాకుండా ఐదు అంచెల విధానంలో సాగునీరు సరఫరా చేయాలని నిర్ణయించినట్టు తెలిపారు. సాగునీటి ఎద్దడి వల్ల మండల పరిధిలో సుమారు 250 ఎకరాల్లో మాత్రమే సాగు జరుగుతుండగా, అందులో 20 ఎకరాల్లో సాగునీటి ఎద్దడి సమస్య ఉన్నదని వ్యవసాయ అధికారులు ఆర్డీవోకు వివరించారు. సదరు సమస్యలపై ఆర్డీవో మాట్లాడుతూ తక్షణం కలెక్టర్‌తో మాట్లాడి సాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, వ్యవసాయ అధికారి రాజేష్, జల వనరుల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ సుబ్రహ్మణ్యం. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాచరరావు తదితరులు పాల్గొన్నారు.

కన్వీనర్లు, గృహ సారథుల పాత్ర కీలకం

- సిటీ ఎమ్మెల్యే చంద్రశేఖరరెడ్డి
- మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డినే సీఎంను చేయాలని పిలుపు



కన్వీనర్లు, గృహసారథుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: రానున్న రోజుల్లో కన్వీనర్లు, గృహసారథుల పాత్ర ఎంతో కీలకమని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక విద్యుత్‌నగర్‌లోని ఎ కన్వెన్షన్‌లో బుధవారం కన్వీనర్లు, గృహసారథులతో ఆయన సమావేశమయ్యారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు, మాజీ మేయర్ సుంకర శివప్రసన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కౌడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ అల్లి రాజబాబు తదితర నేతలు హాజరయ్యారు. రాష్ట్ర ప్రచార కమిటీ ప్రధాన కార్యదర్శి రావూరి వెంకటేశ్వరరావు ప్రారంభోపన్యాసం చేశారు. అనంతరం ద్వారంపూడి మాట్లాడుతూ ప్రతి వలంటీర్ పరిధిలో నియమితులైన గృహసారథులపై ఎంతో కీలకమైన బాధ్యత ఉందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికీ తీసుకువెళ్లడం, నాడు–నేడు ద్వారా గత ప్రభుత్వ పాలన తీరు, ముఖ్యమంత్రి అధికారాన్ని చేపట్టాక మూడేళ్ల ప్రగతిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ విషయంలో కన్వీనర్లు, గృహసారథులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. పార్టీ నుంచి వచ్చే కరపత్రాలను కూడా ప్రజలకు సకాలంలో చేరేలా కృషి చేయాలన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల్లో 75 శాతం మహిళలకు అందజేస్తున్నామని, ఈ వాస్తవాన్ని మహిళలకు, ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి మాట్లాడుతూ వలంటీర్లలాగే గృహసారథులు కూడా ప్రతి కుటుంబంలో ఒక సభ్యునిగా మమేకం కావాలన్నారు. ముఖ్యమంత్రి అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలని సూచించారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు శివప్రసన్న మాట్లాడుతూ నవరత్న పథకాలు, పింఛన్ల పెంపు, ప్రతిభగల విద్యార్థుల కోసం తాజాగా ప్రవేశపెట్టిన విదేశీ విద్య సహా ప్రతి ఒక్క పథకంపై కన్వీనర్లు, గృహసారథులు సంపూర్ణ అవగాహన చేసుకుని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. కన్వీనర్లు, గృహసారథులు పార్టీకి చెవులు, కళ్లుగా ఆమె అభివర్ణిస్తూ మరింత కష్టించి పనిచేయాలని సూచించారు. ఆయా డివిజన్ల కన్వీనర్లు, గృహ సారథులు, మాజీ కార్పొరేటర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గృహసారథులకు పార్టీ నుంచి వచ్చిన సామగ్రిని ఎమ్మెల్యే ద్వారంపూడి అందజేశారు.

ప్రజా సహకారంతోనే పారిశుధ్యం మెరుగు

- అదనపు కమిషనర్ నాగనరసింహారావు
- 20వ డివిజన్‌లో తడి, పొడి చెత్త సేకరణ పరిశీలన



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ సిటీ: చెత్తను డ్రైనేజీల్లో వేయడం వల్ల మురుగు నీటి పారుదలకు అవరోధంగా మారి, పారిశుధ్య నిర్వహణ ఇబ్బంది అవుతుందని, ప్రజలు పరిసరాల పరిశుభ్రతకు సహకరించాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని జగన్నాథపురం 20వ డివిజన్ పరిధిలోని మేకల కబేళా వెనుక ప్రాంతం, పోర్టు ఏరియాల్లో పర్యటించారు. పూడిక తీత పనులతో పాటు ఇంటింటికీ చెత్త సేకరణపై ఆరా తీశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా విభజించి ఇస్తున్నారో లేదో పరిశీలించారు. కొన్ని చోట్ల చెత్తను డ్రైనేజీల్లో వేయడాన్ని గుర్తించారు. దీని వల్ల దోమలు పెరిగి, ప్రజల అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. పారిశుధ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చి చెత్త సేకరిస్తున్నప్పుడు ఇలా రోడ్లపైన, డ్రైన్లలోనూ వేయడం ఏమిటని, ఇకపై అలా చేయవద్దని ప్రజలకు సూచించారు. చెత్తను రోడ్లపైన, డ్రైన్లలోను వేసే వారిపై జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ తరఫున ఎన్ని పాలనా సంస్కరణలు చేపట్టినా ప్రజల సహకారం లేకపోతే ప్రయోజనం ఉండదన్నారు. ఈ విషయంలో సచివాలయ ఉద్యోగులు శానిటరీ కార్యదర్శులు, మేస్త్రిలు, ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలన్నారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రెడ్డి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి

కాకినాడ రూరల్: బీజేపీని సంస్థాగతంగా బలోతం చేస్తున్నట్టు అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటరు రంబాల వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వలసపాకలలోని బీజేపీ కార్యాలయంలో పార్టీ మండల కన్వీనర్ కాళ్ల ధనరాజు అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయిలో పార్టీ బలోపేతంపై చర్చించారు. రంబాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షురాలు పితాని లీలావతి, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

సామర్లకోట: స్థానిక పాత్రులపేటలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. ఈ మేరకు ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,750 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కె.దుర్గాప్రసాద్ తెలిపారు. సీఐ ఆధ్వర్యం లో జరిగిన దాడుల్లో ఎస్సై టి.సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎన్‌ఎం పోస్టుల భర్తీకి చర్యలు



ఆస్పత్రిని పరిశీలించిన డీఎంహెచ్‌ఓ శాంతిప్రభ

సామర్లకోట: జిల్లా పరిధిలో అర్బన్ హెల్త్ సెంటర్లలో ఖాళీగా ఉన్న ఏఎన్‌ఎం పోస్టులను త్వరలో భర్తీ చేయనున్నట్టు డీఎంహెచ్‌ఓ డి.శాంతిప్రభ తెలిపారు. బుధవారం స్థానిక గణపతినగరం, అయోధ్యరామపురంలోని అర్బన్ హెల్త్ సెంటర్లను ఆమె తనిఖీ చేశారు. ఈ మేరకు ప్రతి బుధవారం చిన్నారులకు ఇచ్చే వ్యాధి నిరోధక టీకాలను ఆమె పరిశీలించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో సుఖ ప్రసవాలు జరిగేలా దృష్టి కేంద్రీకరిస్తున్నట్లు చెప్పారు. గర్భిణులు, చిన్నారులకు నూరు శాతం టీకాలు వేసి, మందులు ఇచ్చి వాడించాలన్నారు. మా ఆస్పత్రి అనే నమ్మకంతో ప్రజలు వచ్చేలా సిబ్బంది విధులు నిర్వర్తించాలన్నారు. అయోధ్యరామపురం అర్బన్ హెల్త్ సెంటర్‌లో సదుపాయాలు, మందులు సమృద్ధిగా ఉన్నా సిబ్బంది కొరత వల్ల రోగులు ఇబ్బంది పడుతున్నారని 31వ వార్డు కౌన్సిలర్ పాగా సురేష్ కుమార్ డీఎంహెచ్‌ఓకు వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఒకేసారి సిబ్బంది నియమాకం ఉంటుందని చెప్పారు. అర్బన్ హెల్త్ సెంటర్ల అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని డిప్యూటేషన్ చేస్తామని తెలిపారు.

స్టిక్కర్లపై తుది హెచ్చరిక



చోదకుడితోనే స్టిక్కర్ తీయిస్తున్న ఎస్సైలు ఏసుబాబు, విజయబాబు

కాకినాడ క్రైం: పోలీస్, ప్రెస్, ఇలా వివిధ విభాగాల స్టిక్కర్లతో ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారికి పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. నగరంలో వివిధ కూడళ్లలో ఇలా స్టికర్లు ఉన్న వాహనాలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాఫిక్ డీఎస్పీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో 15 వాహనాలను పట్టుకున్నారు. వాటిలో 7 వాహనాలు పోలీస్, 6 ప్రెస్ మరో 2 రెవెన్యూ స్టిక్కర్లతో ఉన్నాయి. కాకినాడలోని టూ టౌన్ ట్రాఫిక్ పీఎస్ వద్ద బుధవారం రాత్రి చోదకులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇప్పటికే పలు మార్లు హెచ్చరించినా మార్పు రాలేదని చెబుతూ ఇదే ఫైనల్ అంటూ చోదకుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. లైసెన్సు రద్దుకు సిఫార్సు చేసి చట్టపరమైన చర్యలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తమ వాహనాలపై స్టిక్కర్లను వారి చేతే తీయించి ద్విచక్రవాహనాలు అప్పగించారు. ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం ఎస్పీ సాధారణ తనిఖీల్లో భాగంగా కాకినాడ టూ టౌన్ పోలీసు స్టేషన్‌ను పరిశీలించారు.